నిత్యం అప్రమత్తంగా ఉండాలి

వార్డు కార్యాలయంలో పారిశుధ్య కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న పారిశుధ్య జవాన్

పారిశుధ్య సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న జవాన్లు, సూపర్‌వైజర్లు

మణికొండ, మే 28: రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని పారిశుధ్య జవాన్లతో టెలికాన్ఫరెన్స్ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం పారిశుధ్య కార్మికులు, కామాటిలు, చెత్త సేకరణ కార్మికులతో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలంలో ప్రీ-మాన్‌సూన్ కార్యక్రమం అన్ని వార్డుల్లో నిర్వహించాలన్నారు. మ్యాన్‌హోల్స్‌లో మట్టి లేకుండా చూసుకోవాలని, రోడ్ల పక్కన ఎలాంటి మట్టి కుప్పలు, చెత్త కుప్పలు, చెట్లు, చెదారాలు ఉండకుండా చూసుకోవాలన్నారు. పుట్‌పాత్‌లపైన ఎలాంటి వాటర్ డ్రైనేజ్ పక్కన చెత్తచెదారాలు ఉండకుండా చూడాలన్నారు. ప్రతి రోజు ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి డంపింగ్‌కు తరలించాలన్నారు. వర్షం వచ్చే స్థితిలో ఏమైనా అత్యవసరంలో ఇల్లు పడిపోయే స్థితిలో ఉన్నట్లయితే వెంటనే యజమానులకు అవగాహన కల్పించి శిథిలావస్థకు చేరిన ఇండ్లను ఖాళీ చేయించాలన్నారు. వాటర్ స్టాగ్నెట్ పాయింట్స్ ఎక్కడున్నా ఐడెంటిఫై చేసి వాటిని అత్యవసరంగా గుర్తించాలని చెప్పారు. ప్రజలకు రాకపోకలకు ఇబ్బంది కాకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. 24/7 అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను నివృత్తి చేయాలన్నారు. ఈ మేరకు జవాన్లు తమ వార్డు కార్యాలయాల్లో కార్మికులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి వారికి వివరించడం జరిగింది. ఈ సమావేశంలో పారిశుధ్య కార్మికులు, కామాటిలు, చెత్త సేకరణ కార్మికులు పాల్గొన్నారు.

బోర్‌వెల్ సీజ్

జూబ్లీహిల్స్, మే 28: కార్పొరేటర్ అనుమతి ఇచ్చాడంటూ ఒక ఇంటి యజమాని మంగళవారం రహ్మత్‌నగర్ ప్రధాన రహదారిపై బోర్‌వెల్ వేసే పనులు చేపట్టాడు. ఈ విషయాన్ని పలువురు కార్పొరేటర్ సీఎన్ రెడ్డి దృష్టికి తీసుకుపోగా తాను ఎవరికీ ఎలాంటి పర్మిషన్ ఇవ్వలేదని చెప్పారు. అంతేకాక ఈ విషయమై కార్పొరేటర్‌తో పాటు స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే స్పందించిన రెవెన్యూ అధికారులు ఖైరతాబాద్ తహసీల్దార్ నయీముద్దీన్ ఆధ్వర్యంలో సదరు బోర్‌వెల్‌ను సీజ్ చేశారు.

కత్తితో దాడి.. వ్యక్తి అరెస్టు

ఎర్రగడ్డ, మే 28: తలెత్తిన చిన్న గొడవ కారణంగా కోపోద్రిక్తుడైన యువకుడు ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేశాడు. సదరు యువకుణ్ణి బోరబండ పోలీసులు అరెస్టు చేశారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ భూపాల్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. ఎర్రగడ్డకు చెందిన మహ్మద్ హుస్సేన్ ఎర్రగడ్డలో పండ్ల వ్యాపారాన్ని నిర్వహిస్తుంటాడు. సోమవారం రాత్రి అటుగా వెళ్తున్న అల్లాపూర్‌కు చెందిన శివకుమార్‌కు మహ్మద్ స్సేన్‌తో వాగ్వాదం జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన హుస్సేన్ కత్తితో శివకుమార్‌పై దాడి చేశాడు. ఈ ఘటనలో శివకుమార్ భుజానికి గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మంగళవారం హుస్సేన్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుకపర్చగా నిందితునికి 14 రోజుల రిమాండ్‌ను విధించారు. డీఐ భూపాల్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎస్సై మనోజ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెల్టు షాప్ నిర్వాహకులు అరెస్టు

ఎర్రగడ్డ, మే 28: బోరబండలోని బెల్ట్ షాప్‌పై మంగళారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశారు. బోరబండ పీఎస్ డీఐ భూపాల్‌గౌడ్ కథనం ప్రకారం.. బోరబండ బంజారానగర్‌లో సరళ అనే మహిళ దర్జాగా బెల్టు షాప్‌ను లైసెన్స్‌డ్ బార్‌కు ధీటుగా వ్యాపారాన్ని నిర్వహిస్తున్నది. ఈమె వద్ద పుష్ప అనే మరో మహిళ సహాయకురాలిగా పని చేస్తున్నది. పోలీసులు దాడులు జరిపిన సమయంలో అక్కడున్న వాతావరణాన్ని చూసి అవాక్కయ్యారు. ఏకంగా లైసెన్స్‌డ్ బార్‌కు ధీటుగా ఓ షెడ్డులో ఏర్పాట్లు చేసి మద్యం దందా చేస్తున్నారు. అక్కడున్న సరళతో పాటు పుష్పను అరెస్టు చేశారు. వీళ్లను అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్‌కు తరలించారు. బెల్టు దుకాణాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు పేర్కొన్నారు.

కౌంటింగ్‌కు రంగం సిద్ధం

- జూబ్లీహిల్స్ సెగ్మెంట్‌లో 20 టేబుల్స్
- జూన్ 1 నుంచి ఏర్పాట్లు షురూ

జూబ్లీహిల్స్, మే 28: లోక్‌సభ ఎన్నికల్లో తుది అంకానికి రంగం సిద్ధమవుతోంది. జూన్ 4 నిర్వహించనున్న ఓట్ల లెక్కింపుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకుగానూ కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న అధికారులు జూన్ 1 నుంచి కార్యాచరణకు చేపట్టనున్నారు. యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరుగనున్న ఈ ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఇక్కడ స్ట్రాంగ్ రూంల వద్ద సీఆర్‌పీఎఫ్ బలగాలతో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలోని ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లలో 14 టేబుల్స్‌లో కౌంటింగ్ జరుగుతుండగా జూబ్లీహిల్స్ సెగ్మెంట్‌లో ఓట్ల లెక్కింపుకు 20 టేబుల్స్‌ను ఏర్పాటుచేస్తున్నారు. జూన్ 4 న ఉదయం 8.30 గంటలకు కౌంటింగ్ ప్రారంభించే ముందు అన్ని రాజకీయ పార్టీల సమక్షంలో స్ట్రాంగ్ రూంలను తెరిచి 329 పోలింగ్ బూత్‌లకు చెందిన ఈవీఎంలను ఆయా కౌంటింగ్ హాల్‌కు పటిష్ట భద్రత మధ్య తీసుకువస్తారు. ఓట్ల లెక్కింపుకు ఏర్పాటుచేసిన 20 టేబుల్స్‌కు 20 మంది చొప్పున మైక్రో అబ్జర్వర్లు, సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్‌లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లలతో పాటు సుమారు 100 మంది సిబ్బంది కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొంటారని జూబ్లీహిల్స్ ఏఆర్ఓ, సికింద్రాబాద్ ఆర్డీఓ దశరథ్ సింగ్ రాథోడ్ తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని 329 పోలింగ్ బూత్‌లకు గానూ ఓట్ల లెక్కింపులో జాప్యం జరుగకుండా ఉండేందుకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 6 టేబుల్స్‌ను అదనంగా పెంచినట్లు తెలిపారు.

విత్తన కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోండి

రైతు సదస్సులో మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి

మణికొండ, మే 28: విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.గీతారెడ్డి తెలిపారు. మంగళవారం శంషాబాద్ మండలంలోని మదనపల్లి కొత్త తండాలో రైతులకు విత్తనాలు కోనుగోలు విషయంలో అవగాహన కల్పించేందుకు రైతు సదస్సును ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ.. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే ముందు విత్తన ప్యాకెట్లు లూజుగా ఉంటే తీసుకోకూడదని పూర్తి ప్యాకెట్టు ఉంటనే కొనుగోలు చేయాలన్నారు. లూజు విత్తనాలు కొనుగోలు చేస్తే నకిలీ విత్తనాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. దీని ద్వారా రైతులు నష్టపోతారని తెలిపారు. ఒకవేళ విత్తనాల్లో ఏదైనా నకిలీ విత్తనాలు వచ్చి సమస్యలు వచ్చిన అధికారులకు తెలిపేందుకు రసీదు ఉండాలన్నారు. కాబట్టి రైతులు విత్తనాలు కోనే ముందు ఖచ్చితంగా రసీదు తీసుకోవాలని తెలిపారు. ఎందుకంటే విత్తనాల్లో ఏదైనా లోపం సంభవించిన రసీదు దానితో పాటు విత్తనం యొక్క ఖాళీ ప్యాకెట్‌ను కూడా భద్రంగా దాచుకున్నట్లయితే సమస్య వచ్చినప్పుడు వాటి గురించి తెలుసుకోవడానికి సులువుగా ఉంటుందని తెలిపారు. విత్తనాలు ఎక్కడ పడితే అక్కడ కొనకుండా వ్యవసాయ శాఖ గుర్తింపు పొందిన దుకాణాలలోనే కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జి.రాఘవేంద్రకుమార్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు

మైలార్‌దేవ్‌పల్లి, మే 28: భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వ స్వామి ఆలయంలో 7వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. టీఎన్‌జీవోస్‌కాలనీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం మూడో రోజు వేడుకగా జరుగుతున్నాయి. తెల్లవారుజాము నుంచే ఆలయంలో వారికి పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం ఆరాధన, సేవాకాలం, విష్వక్సేనారాధన, పున్యాహవచనం తదితర పూజలు నిర్వహించారు.

ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న భక్తులు

బసవతారకంలో పండ్ల పంపిణీ

మాజీ సీఎం ఎన్టీఆర్ 101వ జయంతి సందర్భంగా బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రిలో చైర్మన్ నందమూరి బాలకృష్ణ మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆస్పత్రిలో క్యాన్సర్ చికిత్స పొందుతున్న చిన్నారులకు పండ్లు అందజేశారు. - బంజారాహిల్స్

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

బహుమతులు గెలుచుకున్న బాలికలతో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చిన్మయి

జూబ్లీహిల్స్, మే 28: బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని యూసుఫ్‌గూడ బస్తీ దవాఖాన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చిన్మయి శ్రీరంగ తెలిపారు. మంగళవారం వరల్డ్ మె హైజిన్ డే సందర్భంగా యూసుఫ్‌గూడ బస్తీ దవాఖానలో కౌమార బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 'అడాలసెంట్ గర్ల్స్ మెన్‌స్ట్రువరల్ హైజిన్' అనే అంశంపై క్విజ్, ఉపన్యాస పోటీలు నిర్వహించి.. విజేతలకు బహుమతులు అందజేశారు. అదే విధంగా బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు హైజిన్ కిట్లు, విటమిన్ ట్యాబ్లెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం కవిత, ఆశా వర్కర్లు సంగీత, మాధవి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కుల వృత్తిదారులను ఆదుకోవాలి

హిమాయత్‌నగర్, మే 28: రాష్ట్రంలోని కుల వృత్తిదారులను ఆదుకునేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు టి.వెంకట్రాములు కోరారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని సమితి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సమాజంలోని వివిధ కులాలకు చెందిన ప్రజలు కుల వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారని.. వారి సంక్షేమం, అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి చేయాలన్నారు. రాజ్యాంగపరమైన హక్కులను కల్పించి సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అత్తాపూర్, మే 28: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో పలు ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఏజీకాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు సంజీవనీ హిల్స్, నలందానగర్, సిరిమల్లేనగర్, ఏజీకాలనీ,

హైదర్‌గూడ ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి ఒంటి గంట వరకు నలందానగర్, వెంకటేశ్వర ఎన్‌క్లేవ్, డాక్టర్స్ కాలనీ, సిరిమల్లే నగర్, లోటస్ స్కూల్, ప్లజెంట్ పార్కు, న్యూ ఫ్రెండ్స్‌కాలనీ, లక్ష్మీనగర్,

అత్తాపూర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 3.30 వరకు ఈశ్వర్ థియేటర్, హైదర్‌గూడ గ్రామం, గాంధీ విగ్రహం, కాంతారెడ్డినగర్, రాధాకృష్ణనగర్, అంబియన్స్‌ఫోర్ట్,

జనప్రియ ఏబీసీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3.30 నుంచి 5 గంటల వరకు కేశవన్‌రగ్, కృష్ణానగర్, శివానగర్, మోర్ సూపర్‌మార్కెట్, గుమ్మకొండకాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని.. తమ సిబ్బందికి సహకరించాలని కోరారు.

అనాథ విద్యార్థులకు రూ.2 లక్షల విరాళం

చెక్కును అందజేస్తున్న మోహన్‌రెడ్డి తదితరులు

ఆర్కేపురం, మే 28 : హైదరాబాద్ తెల్లాపూర్‌కు చెందిన కందూరు మోహన్‌రెడ్డి -నిర్మల దంపతుల పెళ్లి రోజు, మనుమరాలు మోక్ష పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం ఎల్బీనగర్‌లోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థుల చదువు కోసం రూ.2లక్షల రూపాయల చెక్కును గృహ అధ్యక్షుడు మార్గం రాజేశ్ సమక్షంలో విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి విద్యార్థులకు అవసరమయ్యే ఫీజు, టెక్స్ట్ బుక్స్, స్టేషనరీ, కొనుగోలు చేయడానికి రూ.2లక్షలు అంద జేశామని తెలిపారు. దాతలు అందిస్తున్న విరాళాలను సద్వినియోగం చేసుకుని అనాథ విద్యార్థి గృహానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆయన సూచించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సైదాబాద్, మే 28 : అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన గుర్తు తెలియని 55 సంవత్సరాల వయస్సు కలిగిన వృద్ధుడి మృతదేహాన్ని సైదాబాద్ పోలీసులు గుర్తించారు. సింగరేణికాలనీలోని బీసీ హాస్టల్ సమీపంలో గుర్తు తెలియని ముస్లిం వ్యక్తి మృతదేహం పడి ఉందని శుక్రవారం సాయంత్రం స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతి చెందిన వ్యక్తి భిక్షాటన చేసుకొనే ముస్లిం వ్యక్తిగా భావిస్తున్నామని, మృతుడి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీ తెలిసిన వారు సైదాబాద్ పోలీసులకు సమాచారం అందించాల్సిందిగా ఏఎస్సై అశోక్ తెలిపారు.



ఫిలింనగర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తదితరులు

ఎన్టీఆర్ జయంతి సందర్భంగా నందమూరి కుటుంబసభ్యులతో కలిసి అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాగంటి, కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్

తెలుగుజాతికి ఎన్టీఆర్‌తోనే కీర్తిప్రతిష్టలు

బంజారాహిల్స్, మే 28: తెలుగు జాతికి ప్రపంచవ్యాప్తంగా కీర్తి ప్రతిష్టలు, గుర్తింపు తీసుకొచ్చిన మహానీయుడు ఎన్టీఆర్ అని, రాజకీయాల్లో ఆయన పాటించిన విలువలు ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 101వ జయంతి సందర్భంగా ఫిలింనగర్‌లోని ఫిలిం చాంబర్ వద్ద ఆయన విగ్రహానికి నందమూరి కుటుంబసభ్యులతో పాటు ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ.. స్వర్గీయ ఎన్టీఆర్‌తో తన అనుబంధం 1985 నుంచి కొనసాగుతుందని, ఎన్టీఆర్ మీద అభిమానంతో రాజకీయాల్లోకి వచ్చి తెలుగు యువత అధ్యక్షుడిగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించానని గుర్తుచేసుకున్నారు. సినీ నటుడిగా నాటికీ నేటికీ నంబర్‌వన్‌గా చరిత్రలో పేరు లిఖించుకున్న ఎన్టీఆర్ రాజకీయ రంగంలో ప్రవేశించి పేదల కోసం నిరంతరం శ్రమించారన్నారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ఎన్టీఆర్ కుటుంబసభ్యులు నందమూరి మోహనకృష్ణ, నందమూరి మోహన రూపతో కలిసి ఎమ్మెల్యే మాగంటి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫిలింనగర్ సొసైటీ కార్యదర్శి మోహన్ ముళ్లపూడి, కార్పొరేటర్లు దేదీప్యరావు, వెల్దండ వెంకటేశ్, రాజ్‌కుమార్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఆకలి రహిత సమాజ నిర్మాణానికి కృషి

లోగోను ఆవిష్కరిస్తున్న డీఐజీ గజారావు భూపాల్, చిత్రంలో సిరాజ్ తదితరులు

ఖైరతాబాద్, మే 28: ఆకలి రహిత ప్రపంచ నిర్మాణానికి తాము సైతం అంటూ మలబార్ గ్రూప్ ముందుకు వచ్చింది. సామాజిక సేవలో భాగంగా జీరో హంగర్ కార్యక్రమాన్ని చేపడుతున్నది. ఈ సేవల విస్తరణలో భాగంగా వరల్డ్ హంగర్ డే సందర్భంగా మంగళవారం సోమాజిగూడలోని మలబార్ గోల్డ్స్ అండ్ డైమండ్స్ షోరూంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యక్రమ లోగోను ముఖ్యఅతిథిగా హాజరైన పోలీస్ హెడ్‌క్వార్టర్స్ డీఐజీ డాక్టర్ గజారావు భూపాల్, ఏరో స్పేస్ అండ్ డిఫెన్స్ విభాగం డైరెక్టర్ ప్రవీణ్, మలబార్ గోల్డ్ రిటైల్ హెడ్ ఆపరేషన్స్ సిరాజ్‌తో కలిసి ఆవిష్కరించారు. సిరాజ్ మాట్లాడుతూ మలబార్ గ్రూప్ ఆధ్వర్యంలో ఇప్పటికే 16 రాష్ట్రాల్లోని 37 నగరాల్లో 31 వేల మంది పేదలకు ఆహారాన్ని అందిస్తున్నామని, తాజాగా 70 నగరాల్లో 51 వేల మందికి అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సమావేశం

పాలకవర్గం సమావేశంలో పాల్గొన్న సంఘం సభ్యులు

మణికొండ, మే 28: శంషాబాద్ మండలం మల్కారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ పాలకవర్గ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు బుర్కుంట సతీశ్ అధ్యక్షతన పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సంఘంలోని వ్యవసాయ దారులందరు కూడా వారు పొందిన స్వల్పకాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి రుణాసౌకర్యం అర్హత పొందాలన్నారు. సంఘం పరిధిలో గ్రామ ప్రజలకు, రైతు సభ్యులకు వారి అవసరం తీర్చేదుకు స్థానిక మల్కారం గ్రామం సర్వే నంబర్ 43లో 200 ఎరరాల స్థలంలో నాబార్డ్ సహకారంతో రెండు 1500 ఎంటీ గోధాము నిర్మించుకునేందుకు తీర్మానం చేశామన్నారు. పాత అప్పులు వసూలు చేసి వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు, రసాయనిక ఏరువులు అమ్ముటకు నూతన రుణాలు ఎల్‌టీ అప్పులు దు కోట్లు, పంట రుణాలలు రెండు కోట్లు మంజూరు జరిగిందన్నారు. ఈ సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు మేకల ప్రభుసాగర్, డైరెక్టర్లు అయినా రవికాంత్‌రెడ్డి, కాసుల బాల్‌రాజ్‌గౌడ్, హీరేకర్ శివాజీ, పిండి లక్ష్మికృష్ణారెడ్డి, బోనగిరి సత్తయ్య, తెలుగు శంకరయ్య, రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పంచవటికాలనీలో కమిషనర్ పర్యటన

మణికొండ, మే 28: మణికొండ మున్సిపల్ పరిధిలో నెలకొన్న ప్రతి సమస్యను తెలుసుకోని వాటిని పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ వెల్లడించారు. మంగళవారం పంచవటికాలనీలో ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీ వాసులు పలు సమస్యలపై కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. బుల్కాపుర్ నాలా పూడికతీత పనులు, మరమ్మతులు వెంటనే ప్రారంభించాలని కోరారు. గుంతలమయంగా మారిన రోడ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాకాలం మొదలయ్యేలోగా గుంతలన్ని పూడ్చకపోతే ప్రమాదాలకు దారితీస్తాయని తెలిపారు. మెయిన్ రోడ్డులో ట్రాన్స్‌కో అధికారులు కట్టిన చాంబర్ రోడ్డు చాలా ఎత్తుగా ఉండడం వల్ల ప్రమాదాలకు దారి తీస్తున్నాయన్నారు. దానిని సరి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోరారు. కాలనీలో చాలా మంది బిల్డర్లు నిబంధనలకు విరుద్ధంగా ఆరు అంతస్తులు, ఆపై పెంట్ హౌజ్‌లు నిర్మిస్తున్నారన్నారు. వీటిని వెంటనే చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యలన్నిటి పరిష్కరించి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీపతిరెడ్డి, వైజీకే మూర్తి, రామసుబ్బారెడ్డి, రవీందర్‌రెడ్డి, లక్ష్మికాంత్‌రెడ్డి, రాఘవారెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు